క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

ముధోల్: మండల కేంద్రంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గేదె ప్రాణం తీసిన కరెంట్

లోకేశ్వరం: మండలంలోని మల్కాపూర్ శివారులో ఆదివారం మండల కేంద్రానికి చెందిన మెండె లక్ష్మణ్ గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధితుడి వివరాల ప్రకారం గేదెను మేపేందుకు రోజు మాదిరి మల్కాపూర్ శివారులోకి తీసుకెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తుండగా విద్యుత్ సరఫరా అవుతున్న ఎర్తింగ్ వైరుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని.. అధికారులు పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

సభకు తరలిన యాదవులు



వెళ్తున్న యాదవ సంఘం నాయకులు

నిర్మల్‌ఖిల్లా: హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఆదివారం నిర్వహించిన 'యదువంశ యువ గళం' వార్షికోత్సవ సభకు జిల్లా నుంచి యాదవ సంఘం నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ యాదవులంతా ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని సూచించారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో మనోజ్, లక్ష్మణ్, బాలాజీ, పోశెట్టి, నర్సయ్య, నగేశ్ తదితరులున్నారు.

'గృహలక్ష్మి'కి ఎంపిక



పత్రాలు తీసుకుంటున్న లబ్ధిదారులు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ రైతువేదికలో ఆదివారం సర్పంచ్ బక్కి సునీత భోజన్న 12 మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం యువకులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ అలెగ్జాండర్

కడెం: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ అలెగ్జాండర్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నబెల్లాల్ పంచాయతీలోని నర్సింగాపూర్‌లో ఎంపీటీసీ సభ్యురాలు సుద్దాల లక్ష్మితో కలిసి అంగన్‌వాడీ ప్రహరీ, డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ, సర్పంచ్ శ్రీకాంత్‌యాదవ్‌ను సన్మానించారు. జగన్, చెన్ను మల్లేశ్, సునీల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పాదుకల దర్శనం

ముధోల్: మండల కేంద్రంలో అనంత శ్రీ విభూషిత్ జగద్గురు రామానందాచార్య శ్రీ నరేంద్రాచార్య జి మహరాజ్(మహారాష్ట్ర) పాదుక దర్శనం కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులగుండా ప్రత్యేక రథంలో పాదుకలను ఉంచి.. ఊరేగింపు చేపట్టగా భక్తులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే విఠల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామరావుపటేల్, బీజేపీ నాయకులు మోహన్‌రావుపటేల్ వేర్వేరుగా పాదుకలను దర్శించుకున్నారు.

ఆశవర్కర్ల నిరసన

కుంటాల: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశవర్కర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం వారి సమ్మెకు మాజీ ఎంపీపీ అరుణ రమణారావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అనంతరం భోజనం ఏర్పాటు చేయించి..వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆశవర్కర్ల సంఘం మండల కన్వీనర్ ఇంద్రమాల, రాజ్‌కుమార్, రమేశ్, కుమ్మరి గజేందర్, అరిగెల శంకర్ తదితరులు ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–14 ,17 బాల,బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. వీరిలో ఎంపికైన విద్యార్థులు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా చించోలి (బి)లో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ ఎంపిక పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎస్జీఎఫ్ కార్యదర్శి రమణారావు, పేట అసోసియేషన్ కార్యదర్శి భూమన్న తదితరులున్నారు.

ఈ కాలనీని పట్టించుకునేవారేరి?

- బట్టి గల్లీ పక్కన కరువైన డ్రెయినేజీలు, రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- అధికారులు, పాలకులు పట్టించుకోవాలని వేడుకోలు



బురదమయంగా రోడ్డు



పిచ్చిమొక్కలతో రోడ్డు

కుభీర్: మండల కేంద్రంలో బట్టిగల్లీ పక్కన ఉన్న కొత్తకాలనీని సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. కనీసం రోడ్డు, మురుగు కాల్వలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా వీధుల్లోని మట్టిరోడ్లు బురదమయంగా మారుతున్నాయి. సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తే.. మీ కాలనీ కుభీర్ పంచాయతీ పరిధిలో లేదంటున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఎన్నికల వేళ మాత్రం అభివృద్ధి చేస్తామని ఇంటింటికీ వచ్చి ఓట్లు అడుగుతారని.. తర్వాత పరిస్థితి యథావిధిగానే ఉంటుందని పేర్కొంటున్నారు.

ఇరవై ఏళ్ల కిందట ఏర్పాటు..

మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 331లో 12 ఎకరాల 28 గుంటల భూమి ఉండేది. దీనిని స్థానిక విఠలేశ్వర మందిరానికి చెందిన ఇనాం భూమిగా పేర్కొన్నప్పటికీ పహాణీలో మాత్రం పూజారుల పేరిట కిద్మత్ ఇనాంగా ఉంది. ఇరవై ఏళ్ల కిందట ఇందులో రెండెకరాలను పూజారుల నుంచి కుభీర్‌కు చెందిన ఓ వ్యక్తి కొని ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఈ ప్లాట్లను కొందరు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నారు. ప్రస్తుతం కాలనీలో 50 వరకు ఇళ్లు ఉండగా.. జనాభా సుమారు 300 వరకు ఉంది.

కోర్టులో కేసు వేసిన దేవాదాయశాఖ..

మరోవైపు ఈ భూమి మాకే చెందుతుందని దేవాదాయశాఖ అధికారులు కోర్టులో కేసు వేశారు. దీంతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆస్కారం ఉండదు. కోర్టు పరిధిలో ఉండటంతో ఈ కాలనీలో ఇళ్ల కొనుగోలు, అమ్మకాలు రిజిస్ట్రేషన్ కావడం లేదని కాలనీవాసులు అంటున్నారు.

కానరాని సౌకర్యాలు..

ఈ కాలనీలో ఎవరి ఇంటి ముందే వారే మురికి కాల్వ తవ్వుకొని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటారు. వీధుల్లో పూర్తిస్థాయిలో స్తంభాల్లేవ్. భగీరథ నీళ్లు తప్ప కాలనీలో ఒక్క బోరు బావి కూడా లేదు. తాగునీటిని హనుమాన్ మందిరం బోరుబావి నుంచి తెచ్చుకుంటారు. కాలనీల్లో ఉన్న ఖాళీస్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలుతున్నాయి.

మురికి కాలువలు నిర్మించండి



మా కాలనీలో మురికి కాల్వలు లేవు. దుర్వాసన భరించలేకపోతున్నాం.. పంచాయతీవారు మురికి కాలువలు నిర్మించి రోడ్లు బురదమయం కాకుండా చూడాలి. వర్షాకాలం బురదలోనే నడుస్తున్నాం. రాత్రి వీధుల్లో అంధకారంగా ఉంటుంది. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు, బల్బులు ఏర్పాటు చేయాలి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – కర్రె సుదర్శన్, కాలనీవాసి

కాలనీ రికార్డుల్లో లేదు

ఈ కాలనీ విఠలేశ్వర మందిర్ భూమి(ఇనాం)లో ఉంది. ఈ భూమిపై దేవాదాయశాఖ వారు కోర్టులో కేసు వేశారు. దీంతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టే వీలుండదు. పంచాయతీ వారు పన్నులు కూడా వసూలు చేయడం లేదు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. – కవి రాజు, ఎంపీవో

కోర్టులో కేసు ఉంది

ఈ కాలనీ విషయం కోర్టు పరిధిలో ఉంది. దీంతో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవ డం లేదు. ఇప్పటికే ప లుమార్లు సమస్యను పరిష్కరించాలని పాలకులు, అధికారులను కోరాం. – పానాజీ మీరా, కుభీర్ సర్పంచ్

క్రమబద్ధీకరించాలని కార్మికుల ధర్నా



కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

ఖానాపూర్: ప్రభుత్వం తమను క్రమబద్ధీకరించి, నెలకు రూ.21వేల వేతనం చెల్లించాలని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడారు. కార్మికులకు మధ్యంతర భృతితో పాటు ఇళ్లస్థలాలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెకు దిగనున్నట్లు హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, యూనియన్ జిల్లా కార్యదర్శి జన్నారపు సురేశ్, కోశాధికారి శంకరమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు జావిద్, నాగరాజు, నరేష్, భూమన్న, అరుణ్ తదితరులు ఉన్నారు.

'10న హైదరాబాద్ తరలిరావాలి'



కడెంలో మాట్లాడుతున్న నాయకులు

కడెం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 10న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన వంటావార్పు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆరు నెలల పెండింగ్ వేతనాలతోపాటు సీఎం కేసీఆర్ ప్రకటించిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాధ, లత, వెంకవ్వ తదితరులున్నారు.

ఖానాపూర్: హైదరాబాద్‌లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట 13 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా ఆయన బైఠాయించారు. కార్యక్రమంలో కార్మికులు విజయ, పోశవ్వ, రాజవ్వ, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

'కుంటుపడిన ఖానాపూర్ అభివృద్ధి'

ఖానాపూర్: సీఎం కేసీఆర్ హయాంలో ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల అశోక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్ వెనుకబడిందని ఇటీవల నిర్మల్‌లో జరిగిన సభలో మంత్రి కేటీఆరే స్వయంగా ఒప్పుకున్నారన్నారు. ఖానాపూర్‌లో పెద్దాసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. , కడెం మండలం గంగాపూర్‌లో వంతెన లేదని.. కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయని దుస్థితిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ మైనార్టీ విభాగం పట్టణాధ్యక్షుడు షౌకత్‌పాషా, షేక్ యూనిస్ ఉన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రామారావ్ పటేల్

భైంసాటౌన్: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని అనసూయ పవార్ ట్రస్ట్ చైర్మన్ పవార్ రామారావుపటేల్ అన్నారు. భైంసాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఒకరోజు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గం విద్యాపరంగా ముందుండాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు తె లిపారు. ట్రస్ట్ ద్వారా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు బీమా కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన సైకాలజిస్ట్, కెరీర్ కౌన్సిలర్ సుధీర్ సంద్ర, పారమిత స్కూల్స్ డైరెక్టర్ ప్రసాద్‌రావు విద్యా బోధనలో మెళకువలపై వివరించారు.

రైతుల ఆనందమే ప్రధాని లక్ష్యం



ధర్మోరలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

లోకేశ్వరం: రైతుల ఆనందమే ప్రధాని మోదీ లక్ష్యమని.. రాబోయే రోజుల్లో వారి కోసం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెడతారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావ్ పటేల్ అన్నారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంపై ఆదివారం మండలంలోని ధర్మోరలో మంద శ్రీధర్ సాగు చేసిన పసుపు పంటలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేసిన నిజామాబాద్ ఎంపీ అరవింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ సాయినాథ్, కోకన్వీనర్ సుమన్‌కుమార్, ముధోల్ మాజీ ఎంపీపీ సుభాష్ పటేల్, బీజేపీ మండల అధ్యక్షుడు గంగాధర్, జిల్లా కార్యదర్శి నల్ల రమేశ్, ఆనంద్‌రావు, గంజాల గంగాధర్, సురేందర్, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, భోజప్పపటేల్, పాల్గొన్నారు.

పఠనం అలవాటు చేసుకోవాలి



గ్రంథాలయం ప్రారంభిస్తున్న రాజేందర్

సోన్: మానసిక ఉల్లాసం కోసం ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.లక్ష నిధులతో ఏర్పాటు చేసిన గ్రంథాలయం ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యులు జీవన్‌రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ వినోద్ కుమార్, ఉపసర్పంచ్ రాజేశ్వర్, కృష్ణప్రసాద్‌రెడ్డి, గంగాధర్, రాజేశ్వర్, కాంతయ్య పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో విఫలం'

పెంబి: ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ ఆరో పించారు. ఆదివారం మండల కేంద్రంతోపా టు మందపల్లి, నాగాపూర్, ఇటిక్యాల్, తాటిగూడ, పుల్గంపాండ్రి, ఇటిక్యాల్‌తండా తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను గడపగడపకూ తిరుగుతూ వివరించారు. అనంతరం కొట్టుకుపోయిన పస్పుల వంతెన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పస్పుల వంతెన భారీ వర్షాలకు ఏడాది క్రితం కొట్టుకుపోగా మరమ్మతులు చేపట్టలేదని తెలిపారు. గిరిజనుల ఓట్లు వేయించుకుంటున్న పార్టీలు అధికారంలోకి వచ్చాక వారి అ భివృద్ధి, సంక్షేమాన్ని మరిచిపోతున్నాయని వి మర్శించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే సమస్యల ప రిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, నాయకులు శంకర్, రాజన్న, భీంరావు, మహేందర్, అర్జున్, శేఖర్, గోవింద్, నర్సింగ్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్: జిల్లా పౌర సంబంధాలశాఖ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్న పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సహాయ పౌరసంబంధాల అధికారి, పబ్లిసిటీ అసిస్టెంట్(ఫొటోగ్రాఫర్), పబ్లిసిటీ అసిస్టెంట్ (వీడియో కెమెరామెన్) మొత్తం మూడు పోస్టులు భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. సహాయ పౌర సంబంధాల అధికారి పోస్టుకు డిగ్రీతోపాటు జర్నలిజంలో డిప్లొమా చేసి ఉండాలన్నారు. డ్రాఫ్టింగ్ నైపుణ్యంలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. ఫొటోగ్రాఫర్‌కు అర్హతగా పది నుంచి డిగ్రీ వరకు విద్యార్హత, ఫొటోగ్రాఫర్‌గా కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలన్నారు. వీడియో కెమెరామెన్‌కి ఆంధ్రప్రదేశ్ లేదా తెలంగాణ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ బోర్డు నుంచి సినిమాటోగ్రఫీలో డిప్లొమా ఉండాలన్నారు. మిగతా వివరాలకు జిల్లాకేంద్రంలోని ఇంద్రానగర్‌లో జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యాలయంలోనే ఈనెల 10 మంగళవారం సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



జౌలా(బి)లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

తానూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొలూరు, జౌలా(బి), సింగన్‌గాం గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కొలూరుతండాలో రూ.20 లక్షలతో పంచాయతీ భవనం, రూ.10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. జౌలా(బి)లో రూ.14 లక్షలతో ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.2.50 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులతోపాటు సింగన్‌గాంలో రూ.10 లక్షలతో చేపట్టే డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. మహాలక్ష్మి ఆలయ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జల్లావార్ చంద్రకాంత్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, చంద్రకాంత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ సాయన్న, మాజీ సర్పంచ్ గంగన్న ఆదివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సమక్షంలో బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్ వెంకట్‌రావు, బీఆర్‌ఎస్ కన్వీనర్ శ్యాంసుందర్, భోజన్న, సాగర్, సుధాకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బాసరలో ప్రచార రథం ప్రారంభం

భైంసా: బాసరలో సరస్వతీ అమ్మవారిని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. బాసరకు చేరుకున్న ఎమ్మెల్యేకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైల్వేస్టేషన్ నుంచి ఆలయం వరకు భారీ ర్యాలీతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శన అనంతరం ఎన్నికల ప్రచార రథాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈరోజు

విజయవంతం చేయాలి

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే చలో నిర్మల్ ర్యాలీని విజయవంతం చేయాలని అంబేద్కర్ సంఘం మామడ మండలాధ్యక్షుడు మోతె రాజన్న అన్నారు. ఆది వారం మండలంలోని వడ్యాల్ గ్రామంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మామడ మండలం దిమ్మదుర్తిలో అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 9న ఉదయం 11 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అంబేద్కర్ వాదులు రావాలని కోరారు.

ఓటర్ల అవగాహన ర్యాలీ

నిర్మల్: ఓటర్లకు అవగాహన కల్పించడంలో భాగంగా ఎన్నికల కమిషన్ చేపడుతున్న సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కార్యక్రమాల్లో భాగంగా జిల్లాకేంద్రంలో సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 6.30 గంటలకు ఎన్టీఆర్ మినీస్టేడియంలో ప్రారంభమవుతుందని అన్నారు.

మ్యూజియంకు శంకుస్థాపన

నిర్మల్: ఆదివాసీ యోధుడు, నిర్మల్ గడ్డపై పోరాడి వెయ్యిమంది కలిసి ప్రాణార్పణం చేసిన రాంజీగోండు మ్యూజియానికి ఎట్టకేలకు ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో కేంద్రమంత్రులు అర్జున్‌ముండా, కిషన్‌రెడ్డి ఈ మ్యూజియం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు.

విజేతలకు అభినందనలు, సన్మానం

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన గొల్ల గంగాచరణ్, లక్ష్మినారాయణ, గోనేవార్ సాయినాథ్, బాయి సాయినాథ్ ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కింగ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శిశుమందిర్ పాఠశాలలో వారిని అభినందించి సన్మానించారు.

కుంటాల: కుంటాల చెందిన గడ్డం సంధ్యారాణి, లింబా(కె) గ్రామానికి చెందిన అల్లాడి రాకేష్, ఎస్‌డీ ఇర్ఫాన్ ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆదివారం వీరిని మండల కేంద్రంలో పలు సంఘాల నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. గిరీష్‌కుమార్, శ్రీకర్‌రెడ్డి, బొంతల పోశెట్టి, చిప్ప మనోహర్, జనార్దన్, బోగ లక్ష్మణ్, బోగ గోవర్ధన్, సంజీవ్, శివ, గజేందర్, సత్తయ్య, నారాయణ, మాధవరావు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లిలో షేర్ ప్రవీణ్‌రెడ్డి, కొయ్యల హరీశ్‌రెడ్డి కానిస్టేబుల్ ఉద్యోగాలకు.. కమల్‌కోట ప్రణవ్ ప్రసాద్‌రెడ్డి ఆర్మీకి ఎంపికయ్యారు. ఆదివారం గ్రామంలో ముగ్గురిని సన్మానించారు. అసెంబ్లీ డిప్యూటీ మాజీ స్పీకర్ తనయుడు అయిండ్ల భూపాల్‌రెడ్డి, సర్పంచ్ కమల్‌కోట పద్మ, నర్సారెడ్డి, రాజారెడ్డి, భీంరెడ్డి, దామోదర్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని రాంటెక్‌కు చెందిన సింగోల్ల సాయినాథ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. అతడిని గ్రామస్తులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

చిన్నారులకు ఆర్థికసాయం

ఖానాపూర్: గణేశుడి నిమజ్జన శోభాయాత్రలో భాగంగా పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో ముగ్గురు బాలురు విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో సూర రాకేశ్ కాలు, కన్నును కోల్పోయాడు. ఓర్సు రాకేశ్‌కు కడుపులో గాయమైంది. మరో బాలుడు అరవింద్ స్వల్పంగా గాయపడగా ఇంటివద్దే చికిత్స పొందుతున్నాడు. ఆదివారం బాధిత కుటుంబాలను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి బ్యాచ్ మిత్రబృందం పరామర్శించారు. అనంతరం వారికి సాయంగా రూ.10వేలను అందించారు.

'అమిత్‌షా సభకు తరలిరావాలి'

కడెం: ఆదిలాబాద్‌లో ఈనెల 10న నిర్వహించే అమిత్‌షా (ఆదిలాబాద్ జనగర్జన) సభకు బీజేపీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.ఉమ్మడి జిల్లాలో ఐదు నియోజవర్గాల్లో బీజేపీ గెలుస్తుందని సర్వేల్లో తేలినట్లు పేర్కొన్నారు. పెంబి జెడ్పీటీసీ జానుబాయి, రితీశ్ రాథోడ్, కిష్టయ్య, లక్ష్మణ్, రాజేందర్, మోహన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

భూమిపూజ

కుంటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చాకలి ఐలమ్మ విగ్రహ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్, సర్పంచ్ సమతా వెంకటేష్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాత్రి, జీవి రమణారావు, పోశెట్టి, గజేందర్, లక్ష్మణ్, విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పురగిరి క్షత్రియ పెరిక సంఘం కార్యవర్గం

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలో ఆదివారం పురగిరి క్షత్రియ పెరిక సంఘం లక్ష్మణచాంద, మామడ మండలాల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు భూమయ్య, ఉపాధ్యక్షుడు వెంకటరాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం లక్ష్మణచాంద మండలాధ్యక్షుడిగా బుర్రి మహేందర్, మామడ మండలాధ్యక్షుడిగా బొడ్డు నరేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భూమేశ్, మహేందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ

కడెం: మండలంలోని అంబారిపేట్‌లో ఆదివారం సర్పంచ్ కొప్పుల లక్ష్మి మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. సీసీ స్వామి, లచ్చన్న, రాజేశ్, ప్రసాద్, వీవోఏ కవిత, భూమన్న తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్‌లో సర్పంచ్ నరేశ్ చీరలు పంపిణీ చేశారు.